నిరాడంబరత – నిజమైన గొప్పదనం – నారంశెట్టి ఉమామహేశ్వరరావు .

తరువు లతిరస ఫలభార గురుత గాంచు/

నింగి వ్రేలుచు నమృత మొసంగు మేఘు/

డుద్ధతులు గారు బుధులు సమృద్ధి చేత/

జగతి నుపకర్తలకు నిది సహజగుణము/ అన్నారు భర్తృహరి.

వృక్షాలు ఫల కాలంలో ఒంగి ఉంటాయి. నీళ్లతో నిండిన మేఘాలు బరువుచే క్రిందిగా వేలాడుతూ ఉంటాయి. సత్పురుషులు సంపదలు వచ్చినప్పుడు గర్వంతో ప్రవర్తించరు . ఇది పరోపకార పరాయణుల స్వభావం. పై పద్యంలో చెప్పుకున్న నమ్రత, క్రిందుగా ఉండడం, గర్వం లేకుండా ప్రవర్తించడం అనేవి పరోపకారుల సహజ గుణం. ఇలా ఉండాడాన్ని వినయంగా ఉండడమని చెబుతాము. అంతే కాదు. పర్వతాలు ఎత్తుగా ఉన్నా సరే అవి కొంతవరకు ఒరుసుకుని వంగినట్లు కనిపిస్తాయి. నదులు స్వచ్ఛమైన నీరుతో ప్రవహిస్తున్నా సరే తమ గురించి ప్రచారం చేసుకోవు. గుణవంతులు గొప్ప విజయాలు సాధించినప్పటికీ మరింత వినయంగా ఉంటారు. ( కానీ అహంకారం గలవారు వినయం చూపించలేరు. సరికదా కన్నూమిన్నూ కానక ప్రవర్తిస్తారు. అలా కాకుండా జ్ఞానం, గొప్పతనం పెరుగుతున్న కొద్దీ మనుషులు మరింత వినయంగా ఉండడానికి ప్రయత్నించాలి.) ఉన్నత స్థానానికి చేరుకున్న కొలదీ , అహంకారానికి లోనవకుండా, నిరాడంబరంగా ఉండాలని గ్రంథాలు చెబుతున్నాయి .

వినయవిధేయతలకు నిరాడంబరత్వానికి అవినాభావ సంబంధం ఉంది. ఒకటి ఉన్న చోట మరొకటి ఉండి తీరుతాయి. వినయ విధేయతలు కలవారు నిరాడంబరులుగా ఉంటారు. అంతే విధంగా నిరాడంబరులు వినయ విధేయతలతో ప్రవర్తిస్తారు. ఇలాగే లోకంలో జరుగుతుంది. ఇంతకీ నిరాడంబరత అంటే ఏమిటనేది ఈ నెల మనం తెలుసుకోబోతున్న అంశం.

ఎంత ఉన్నా ఏమీ లేనట్టే సాధారణమైన జీవితాన్ని గడపడమే నిరాడంబరత. వేషభాషల్ని, అలవాట్లని, ప్రవర్తనని సహజంగా ఉన్నదున్నట్టు ప్రకటించడమే నిరాడంబరత. అదొక గొప్ప వ్యక్తిత్వ లక్షణం. తన కోసం తాను బ్రతకడమెలాగో తెలిసిన వాళ్లే నిరాడంబరంగా జీవిస్తారు. ఎదుటి వాళ్ల మెప్పు పొందాలని ఆశించే వాళ్లు సహజత్వానికి దూరంగా….. వేషభాషల్లో భేషజాలు ప్రదర్శించి నిజ జీవితంలో నటిస్తూ జీవిస్తారు. ఇలాంటి వారు మనకు సమాజంలో అడుగడుగునా కనబడతారు.

ఒక వ్యక్తి ఎంత సాధించినా, ఎంత పెద్ద స్థాయికి చేరుకున్నా , అతను నిరాడంబరంగా ఉంటే ప్రజల హృదయాల్లో స్థానం పొందుతాడు. నిరాడంబరత అనేది చూడడానికి తక్కువగా కనిపించినా అదొక గొప్ప లక్షణం. మానసికంగా ఎంతో ఎత్తుకు ఎదిగినవాళ్లే ప్రక్కవాళ్ళ మెప్పు కోసం కాకుండా తమ కోసం తాము నచ్చిన విధంగా జీవిస్తారు. నిజానికిది వ్యక్తిత్వాన్ని మెరుగుపరచి, సమాజంలో గుర్తింపు తెస్తుంది. నిజమైన

మహానుభావులు నిరాడంబరంగానే జీవిస్తారు. స్వామి వివేకానంద, మహాత్మా గాంధీ, అబ్దుల్ కలాం మొదలైనవాళ్లు ఆ కోవకు చెందిన వాళ్ళే. నిరాడంబరతను అలవాటు చేసుకున్నప్పుడే అందులోని అసలైన ఆనందం తెలుస్తుంది.

ప్రపంచంలో మనకు కావలసిన వస్తువులు, అలంకరణ సామాగ్రి, అందమైన బొమ్మలు, రంగురంగుల బట్టలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, వాహనాలు వంటివి ఎన్నో ఉన్నాయి. ఇవన్నీ సంతోషపరుస్తాయని అనుకుంటారేమో కానీ హృదయం లోపల నిజమైన సంతోషం కలగాలంటే ఇవేవీ అక్కర్లేదు. నిరాడంబరంగా జీవించడం తెలిస్తే చాలు. తక్కువ వస్తువులతో ఎక్కువ సంతోషాన్ని పొందవచ్చు. ఉన్నంతలో , ఉన్న వాటితో సంతృప్తి పడడం, ఉన్న వాటిని ఇతరులతో పంచుకోవడం, ప్రకృతిని ప్రేమించడం, డబ్బు కన్నా విలువైన అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడం మొదలైనవన్నీ నిరాడంబరతకు చిహ్నాలే.

వస్తువులతో కూడిన సంతోషం తాత్కాలికమైనది. స్నేహితులతో, కుటుంబంతో గడపడంలో నిజమైన ఆనందం ఉంది. ప్రేమ, దయ, సహాయం చేసే గుణంలో సంతోషం ఉంది. డబ్బు కన్నా విలువైనవి, డబ్బుతో కొనలేనివి ప్రపంచంలో చాలా ఉన్నాయి. అవి ప్రేమ, స్నేహం, ఆరోగ్యం వంటివి. ఎంత ధర చెల్లిస్తామన్నా దొరకవు.

పైన చెప్పుకున్నవే కాక ప్రకృతిలో చెట్లు, పువ్వులు, కొండలు, లోయలు, నదులు, జలపాతాలు మొదలైనవి ఉన్నాయి. వాటిని చూసి సంతోషించవచ్చు. ప్రకృతితో అనుబంధం మనసుకు ప్రశాంతత ఇస్తుంది . ఇతరులకు సహాయం చేయడం వల్ల ఆనందం కలుగుతుంది. మన దగ్గర ఉన్నది కొద్దిగా అయినా ఇతరులతో పంచుకోవడమనేది గొప్ప విషయం.

నిరాడంబరత కొందరికి స్వాభావికం కాగా మరి కొందరికి అభ్యాసం వల్ల అలవడుతుంది. నిరాడంబరత జనుల ఆహార్యానికి వర్తిస్తుంది. వేసుకునే దుస్తులు వాళ్ళవాళ్ళ ఆలోచనా తీరుని చెబుతాయి. సమయానికి, సందర్భానికి ఎలాంటి దుస్తులు వేసుకోవాలో నేర్పుతాయి. మనకు అవసరానికి సరిపడేవి మాత్రమే ఉంచుకోవాలి. ఉపయోగించని వస్తువులను, దుస్తులను అవసరంలో ఉన్నవాళ్లకి ఇవ్వడం అలవాటు చేసుకోవాలి. ఆడంబరాలను సూచించే కొన్ని అలవాట్లను మానుకోవాలి. ఇలా పొదుపుగా ప్రవర్తించడం కూడా నిరాడంబరత్వమే .

వేష భాషలు ఇతరుల పట్ల ప్రవర్తించే తీరులో డాంబికాన్ని ప్రదర్శించకపోవడం నిరాడంబరత్వమే. ఎంత సంపద ఉన్నా సంపన్నులమనే భావాన్ని మనసులోకి రానివ్వకపోవడమే నిరాడంబరత.

“అల్పుడెపుడు పల్కు ఆడంబరముగాను/,

సజ్జనుండు పల్కు చల్లగాను/

కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా/

విశ్వదాభిరామ వినుర వేమ/ " అని ఏనాడో వేమన కవి చెప్పారు.

ప్రగల్భాలు పలకడం అల్పుల లక్షణం. గొప్పవాళ్ళు ఎప్పుడూ గొప్పలకు పో(బో)రు. కంచు గణగణ మ్రోగుతుంది. అల్పుని డంభాలు కూడ అంతే. కమ్మగా వాగే కంచుకి విలువ తక్కువ . ఎంతో విలువైన బంగారం క్రింద పడినా శబ్దం చెయ్యదు. గొప్పవాళ్లు కూడ అంతేనని భావం. ముందే చెప్పుకున్నట్లుగా నిరాడంబరులంతా గొప్పవాళ్లే. ఆడంబరం లేని ఆహార్యంతో పలువురుని ఆకర్షిస్తారు నిరాడంబరులు . అందుకే వివేకానందుడి ఆహార్యం, ఉపన్యాసాలు ప్రపంచాన్ని భారత్ వైపు చూసేట్లు చేశాయి.

**"Be like water, not luxurious but valuable for life "** అన్నది ఆంగ్ల సూక్తి . నీరులా నిరాడంబరంగా ఉండండి ... హంగులు ఆర్భాటాలు లేకుండానే జీవించడానికి ముఖ్యమైన వస్తువుగా మారవచ్చు" అనేది భావం. నీరు ఏ పాత్రలో పోస్తే ఆ రూపంలోకి ఒదిగిపోయే వినయ స్వభావం కలది . కానీ ప్రాణాలు కాపాడగలిగే శక్తి ఉండడం వల్ల, నీటికి తగిన ప్రాధాన్యత ఎప్పుడూ ఉంటుంది.

"నిరాడంబరత కన్నా గొప్పది ఏదీ లేదు. గొప్పదనం ఎప్పుడూ నిరాడంబరం గానే ఉంటుంది" – అని ఎమర్సన్ చెప్పినట్టు ప్రవర్తించిన మహానుభావులున్నారు.

మాహాత్మా గాంధీ నాయకుడిగా గుర్తింపు పొందినప్పటికీ, ఎంతో నిరాడంబరంగా జీవించారు. సాదాగా ఉండే పంచెకట్టు, పైన గావంచా ధరించి, చేతిలో కర్రతో స్వదేశీ వస్తువులను ప్రోత్సహిస్తూ, అందరికీ సులభంగా అందుబాటులో ఉండే వారు. ఆయన కావాలంటే సూటూబూటూ వేసుకోవచ్చు. దర్జాగా కారుల్లో తిరగొచ్చు. కానీ అవన్నీ వద్దనుకుని నిరాడంబర జీవితానికి అలవాటు పడ్డారు.

ఒకసారి రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గోడానికి ఇంగ్లాండ్ వెళ్ళారు గాంధీజీ . అక్కడ పెద్ద హోటల్లో మకాం ఏర్పాటు చేశారాయనకి. ఆ దేశంలో ఉన్న ధనవంతులు కూడ ఆయనకు స్వాగతం పలికారు. తమ భవనాల్లో ఉండాల్సిందిగా ఆహ్వానించారు. వారి ఆహ్వానాలను సున్నితంగా తిరస్కరించారు గాంధీ. ఈస్ట్ ఎండ్ ప్రాంతంలో మ్యూరియల్ లెస్టర్ లోని స్నేహితుల గృహంలో ఉన్నారు. లండన్ లో వెస్ట్ ఎండ్ అనేది డబ్బున్న వాళ్లు నివసించే ప్రాంతం. ఈస్ట్ ఎండ్ అనేది పేదవాళ్లు ఉండే చోటు. పేదవాళ్లుండే ప్రాంతాన్నే గాంధీజీ ఎంచుకోవడం ఆయన నిరాడంబరతకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

మరోసారి ఆయన చాలా కాలం జైల్లో ఉన్నారు. అతనిని చూడడానికి వచ్చే ధనికులైన అతిధుల సౌకర్యం కోసం ఆశ్రమంలో పెద్ద భవనాన్ని నిర్మించారు అనుచరులు. గాంధీజీ జైలు నుండి విడుదలై రాగానే ఆ భవనాన్ని చూసి ఎందుకు నిర్మించారో అడిగి తెలుసుకున్నారు. సంపన్న అతిథుల కోసమని తెలియగానే ఆ భవనాన్ని పేదలకు ఆసుపత్రిగా మార్పించారు. ఆయన ఎంతో నిరాడంబరంగా జీవించినా ఆయన విలువ తగ్గలేదు కదా. ఆయన్ని లోకం గుర్తించిన తీరు అందరికీ తెలిసిందే. చేసే పనుల వల్ల పేరు వస్తుంది కానీ వేసే దుస్తులవల్ల, ఆభరణాల వల్ల కాదని అర్థం చేసుకోవాలి.

**"A tree laden with fruits always bends low"** – ఫలాలతో నిండిన వృక్షం ఎప్పుడూ తలదించుకుంటుంది అని ఆంగ్ల సామెత. గొప్పవారు ఎప్పుడూ నిరాడంబరంగా ఉంటారని భావం.

ఆ ఆంగ్ల సూక్తికి సరిగ్గా సరిపోయే మహోన్నత వ్యక్తి మాజీ ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రి. నైతిక విలువలకు కట్టుబడి ఉండే ఆదర్శమే ఆయన్ని విశిష్ట వ్యక్తిగా నిలిపింది. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నప్పుడు తన పరిధిలో ఏ తప్పు జరిగినా దానికి తానే బాధ్యత వహించాలన్న నీతిని రాజకీయాలకు అందించిన మహానుభావుడు ఆయన.

ఒకసారి ఆయన రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు రైలు ప్రమాదం జరిగితే నైతిక బాధ్యత వహిస్తూ తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆయన దేశ ప్రధానిగా ఉన్నప్పుడు కూడా సాధారణమైన జీవితాన్ని గడిపారు. తన ఇంటిని కూడా ప్రభుత్వ ఖర్చులతో మార్పులు చేయకూడదని ఆదేశించారు.

ఒకసారి విదేశాలకు శాస్త్రీజీ వెళ్లినప్పుడు, ప్రభుత్వ ఖర్చులతో కాకుండా తన సొంత డబ్బులతోనే వెళ్లారు. తన కుమారుడు చదువుతున్న స్కూల్‌లో ఫీజు కట్టడానికి డబ్బులు లేక ఇబ్బంది పడుతుంటే, స్కూల్ యాజమాన్యం ఆయనకు ప్రత్యేకంగా పరిగణించబోతే శాస్త్రి గారు సున్నితంగా తిరస్కరించారు. మిగతా విద్యార్థులతో సమానంగా తన కుమారుడిని చూడాలని కోరారు.

గోవింద్ వల్లభ పంత్ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో , **1945** ప్రాంతంలో శాస్త్రి గారు హోమ్ మంత్రిగా పనిచేస్తున్న సందర్భంలో మరో సంఘటన జరిగింది. ఆగ్రాలో ఒక ప్రారంభోత్సవానికి వెళ్లారు లాల్ బహదూర్ శాస్త్రి. ఆయన లక్నో నుంచి రైలులో ప్రయాణం చేసి ఆగ్రా ప్లాట్ ఫారం మీద దిగారు. సభకు ఆలస్యం అవుతుందనే ఆందోళనలో చేతిలో సూట్ కేసు పట్టుకొని పర్యాటకులతో కలిసి ప్లాట్ ఫారం మీదకు వెళుతుండగా, ఒక పోలీస్ అధికారి ఆయన్ని అడ్డుకున్నాడు. 'ఎక్కడికలా ఉరుకులు పరుగులు పెడుతున్నావు. హోం మంత్రి గారు వస్తున్నారు. అందువల్ల రాకపోకలు ఆపాము. ఆయన బయటకు వెళ్లిన తరువాత నువ్వు వెళ్ళు' అన్నాడు ఉరిమి చూస్తూ.

నిరాడంబర వేషధారి, డాబు దర్పం తెలియనివారు, వంది మాగధులు ఎవర్నీ అనుసరించనివ్వని వారైన లాల్ బహుదూర్ శాస్త్రి గారిని ఆ పోలీస్ అధికారి నిజంగానే గుర్తించలేదు . ఇంతలో అధికార యంత్రాంగంతో బాటు ఆగ్రా పుర ప్రముఖులు పూలదండలతో, బ్యాండ్ మేళంతో మంత్రిగారి కోసం గాలిస్తూ , పోలీసు అధికారి ముందు నిలుచున్న శాస్త్రి గారిని గుర్తించారు. జరిగిన పొరపాటుకు క్షమించాల్సిందిగా వేడుకొన్నారు. ఎక్కడ తన ఉద్యోగం ఊడుతుందోనన్న భయంతో ఆ పోలీసు అధికారి శాస్త్రి గారి కాళ్ళ మీద పడ్డాడు. లాల్ బహుదూర్ శాస్త్రి చిరునవ్వుతో "భవిష్యత్తులో ఏ మంత్రి రాకపోకలైనా సరే సామాన్యులకు ఇబ్బంది కలిగించకూడదని" చెప్పారు. ఆ పైన హుందాగా అక్కడి నుండి వెళ్లిపోయారు . అదీ నిరాడంబర జీవితమంటే. ఏ పదవి లో ఉన్నప్పటికీ అది తాత్కాలికమే అనుకుని తనలా తాను బ్రతకడం నిజమైన నిరాడంబరత్వం.

ఉత్తమ గుణములు నీచున/

కెత్తెఱగున, గలుగనేర్చు? నెయ్యెడలాం దా/

నెత్తెచ్చి కరుగ(బోసిన/

నిత్తడి బంగారమగునె యిలలో సుమతీ।/

అన్నారు సుమతీ శతకకారుడు.

దొడ్డవారి దొడ్డ గుణాలు వారికి సహజంగా కలుగుతాయి. అవి అల్పులకు ఎంత ప్రయత్నించినా అలవడబోవు. ఇత్తడి గొప్పదని విలువ కల్పించి కరగించి అచ్చుగా పోసినా అది పుత్తడి కాబోదు అని భావం.

మరింత వివరంగా చెప్పుకుంటే—-

సత్పురుషులకు సద్గుణాలు పుట్టుకతోనే స్వభావసిద్ధాలై వస్తాయి. ఆ గుణాలు తెచ్చి పెట్టుకుందామని అల్పులు ఎంత ప్రయత్నించినా వారికవి కలుగవు. ఇత్తడి కంటే పుత్తడికి విలువ ఎక్కువ. దేనిగుణాలు దానివే . ఇత్తడి ఇత్తడే. బంగారం బంగారమే.

సుమతీ పద్య భావానికి సరిగ్గా ఇమిడిపోయే గొప్ప వ్యక్తి మన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం. దేశ అత్యున్నత పదవుల్లో ఉన్నప్పటికీ అహంకారం లేకుండా, సాధారణ జీవితం గడిపారు. పదవిలో ఉన్నప్పుడు, పదవీకాలం ముగిశాక కూడా ఎటువంటి ప్రత్యేక సౌకర్యాలను ఆశించలేదు. కొద్ది మొత్తం ఆస్తితో, భవిష్యత్తు గురించిన ఆలోచన లేకుండా జీవితం గడిపారు. ఆయన మరణానికి ముందు ఆయనకున్న ఆస్తి కొన్ని కుర్చీలు, మరికొన్ని పుస్తకాలు, ఒక చిన్న ఇంటి ఫ్లాట్ మాత్రమే. సంపాదనకన్నా జ్ఞానం పంచడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారాయన.

కలాం గారు పిల్లలతో కలిసి మాట్లాడిన విధానం ఎంతో నిరాడంబరంగా ఉండేది. ఎప్పుడూ విద్యార్థుల మధ్య గడిపేందుకు ఆసక్తి చూపేవారాయన. రాష్ట్రపతి భవన్‌లో ఉన్నప్పుడు ప్రభుత్వం ఇచ్చిన సౌకర్యాలను తక్కువగా వినియోగించుకొనేవారు. ఒక సామాన్య భారతీయుడిలా జీవితం గడిపారు తప్ప ఆర్భాటాలకు పోలేదు. సౌకర్యాలను కోరలేదు.

మరో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కూడా నిరాడంబరులే. రాజకీయాల్లో ఉన్నప్పటికీ, ఎప్పుడూ అహంకారంతో మాట్లాడలేదు. ప్రజా సంక్షేమానికే తన కృషిని అంకితం చేశారు. ఎప్పుడూ ప్రశంసలు ఆశించలేదు. మౌనమే ఆయుధంగా పని చేసుకుపోయేవారు. విమర్శలు ఎదురైనప్పటికీ స్పందించకుండా తన పని గురించి మాత్రమే పట్టించుకునేవారు. ఆయన నిబద్ధత, పట్టుదల, విధేయత దేశాన్ని అభివృద్ధి దిశగా నడిపించాయి. విదేశీ మారక ద్రవ్య లోటుతో కష్టాల్లో ఉన్న భారతదేశ ఆర్థిక వ్యవస్థని సరళీకృత ఆర్థిక విధానాలతో ఒక గాడిన పెట్టడమే కాకుండా దేశాన్ని ఉన్నతస్థానంలో నిలిపారు.

నిరాడంబర జీవితం గడిపిన మరో నాయకుడి గురించి తెలుసుకుందాం. నమ్మిన సిద్ధాంతం కోసం ఎంతటి వారినైనా ఎదురించే గుణం టంగుటూరి ప్రకాశం పంతులు గారిది. బారిస్టర్ కోర్సు పూర్తి చేసి మద్రాసు హైకోర్టులో ప్రాక్టీస్ మొదలుపెట్టి **1921** లో ఆ వృత్తిని వదిలేసే వరకు జమీందారులా బ్రతికారాయన. దేశ స్వాతంత్రం కోసం నడుపుతున్న ఉద్యమంలో ఆయన చేరిన నాటికి ఆయన ఆస్తి **13** లక్షల పైనే ఉండేది. అప్పట్లో ఆరు పైసలకు కిలో బియ్యం వచ్చేవి . అంత డబ్బుని ప్రజల కోసం ఖర్చుపెట్టిన త్యాగం ఆయనది. పదవిలో ఉన్నా లేకున్నా ప్రజా సంక్షేమమే ఊపిరిగా జీవించిన ఆంధ్ర కేసరి తెలుగువారి సాహసానికి, పౌరుషానికి ప్రతీక. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ చాలా సాధారణమైన జీవితాన్ని గడిపారు.

సదమల మతితో బెద్దల /

మదికింపుగ మెలగ, నింద మానుము పరులన్/

మృదు మార్గములను వదలకు/

విదితంబుగ దాన కీర్తి వెలయు కుమారా!/ అంటోంది కుమార శతకం.

పెద్దలు సంతోషించునట్లు నిర్మలమైన మనసుతో మెలగాలి . ఇతరులను నిందించడం మానివేయాలి . మంచి పద్ధతులను విడిచిపెట్టవద్దు. ఈ విధముగా నడుచుకుంటే మంచి పేరు వస్తుందని బావం.

కుమార శతకంలోని పై పద్యాన్ని అతను చదవకపోయినా సరే మంచి పద్ధతులు పాటించి లోకం మెచ్చే వ్యక్తి అయ్యాడు రాక్ ఫెల్లర్. అతను ప్రపంచంలో అత్యధిక ధనవంతునిగా నిర్ధారించబడిన వారిలో ఒకరు. ఈయన తన కఠోర పరిశ్రమ , నాయకత్వ లక్షణాల ద్వారా ఉన్నతస్థితికి చేరుకున్నాడు. వంశపారంపర్యంగా వచ్చినదేదీ లేదు ఆయనకి. అతని తల్లి కోళ్ల ఫారం నడిపేది. ఆమెకు పనిలో సహాయపడుతూ ఉండటం వల్ల ఆయనకు నెలకు ఒక డాలర్ కూలీ దొరికేది. ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ చెమటోడ్చి పని చేసి నూనె వ్యాపారం చేసి కోటీశ్వరుడు అయ్యాడు. అనేక సేవా సంస్థలకు పెద్ద పెద్ద విరాళాలు ఇచ్చేవాడు. ఈయన గొప్పతనం ఏమిటంటే ఎప్పుడూ వినమ్రుడై ఉండేవాడు . సంపాదనలో తక్కువ ఖర్చు పెడుతూ నిరాడంబరంగా బ్రతికేవాడు. పరమార్ధమైన ఇటువంటి వ్యక్తుల వలన ‘గోరింటాకు రుబ్బిన వారి చేతులు పండినట్లే’ అందరి మేలు కోరుతూ ఆయన గొప్పవాడు అయ్యాడు. ప్రపంచానికే అనేక సేవలు అందించాడు.

నిరాడంబరంగా బ్రతకడానికి , ఆడంబరంగా జీవించడానికి మధ్య ఉన్న తేడాని తెలుసుకోవాలంటే ఇద్దరు ప్రముఖుల జీవితాలు పరిశీలించాలి. వాళ్లలో ఒకరు రోనాల్డ్ రీడ్. మరొకరు రిచర్డ్ ఫస్కోన్.

అమెరికాకు చెందిన రొనాల్డ్ రీడ్ **(Ronald Read)** పది సంవత్సరాలు ఒక గ్యాస్ స్టేషన్‌లో పనిచేశాడు. తర్వాత స్థిరమైన కార్యాలయ సేవలలో ఉద్యోగం చేశాడు. కానీ అతను నిరాడంబరమైన జీవితం గడిపాడు. తక్కువ ఖర్చుతో జీవించేవాడు. మరొకవైపు తన ఆదాయాన్ని స్మార్ట్ గా పెట్టుబడులు పెట్టడానికి ఉపయోగించాడు. అతను చదివిన పుస్తకాల ద్వారా పెట్టుబడుల పట్ల అవగాహన పెంచుకున్నాడు. ప్రత్యేకంగా స్టాక్స్ మార్కెట్ లో అలవాటుగా పెట్టుబడులు పెట్టడం ద్వారా గొప్ప ధనవంతుడయ్యాడు. ఆయన **2014**లో **92** ఏళ్ల వయస్సులో మరణించాడు. అతను తన మరణం తరువాత తన సంపదను అనేక చారిటీ సంస్థలకు దాన ధర్మాలు చేశాడు. అతని ఆస్తి విలువ సుమారు **8** మిలియన్ డాలర్లు (సుమారు **60** కోట్ల రూపాయలు) ఉండగా, దానిని అతను అనేక అవసరమైన ప్రాంతాలలో ఉపయోగించాడు.

అతని జీవితం పరిశీలిస్తే సామాన్యంగా జీవించినప్పటికీ దాన ధర్మాలు చేయడం, సంపదను కూడబెట్టడం, దాన్ని సమాజానికి తిరిగి ఇవ్వడం అనే విషయాలు అతనిని ప్రముఖుడిని చేశాయి.

సరిగ్గా ఇతనికి వ్యతిరేక లక్షణాలున్న వ్యక్తి రిచర్డ్ ఫస్కోన్ **(Richard Fuscone)**. అతను ఆడంబరంగా జీవించేవాడు. ఆయనొక ప్రముఖ అమెరికన్ ఫైనాన్షియల్ ఎగ్జిక్యూటివ్. తన ఉద్యోగ జీవితాన్ని పెద్ద సంస్థలలో, ముఖ్యంగా ఫైనాన్షియల్ సెక్టార్‌లో, హ్యార్లీ-డేవిడ్సన్ మరియు యునైటెడ్ హెల్త్ గ్రూప్ వంటి సంస్థల్లో గడిపాడు. అందువల్ల గొప్ప సంపద గడించాడు. అంతేకాదు అధిక స్థాయి జీవన శైలిని పాటించే వ్యక్తిగా జీవించాడు. తనకి వచ్చిన ధనాన్ని విలాసాలకు ఖర్చు చేసాడు. తన స్థాయిని కొనసాగించడానికి భారీగా అప్పులు చేసాడు. ఆ వెంటనే ఆర్థిక సంక్షోభం రావడంతో దివాలా తీసాడు . అతని ఆస్తుల్ని అసలు విలువ కన్నా **75** శాతం తక్కువకు అమ్ముకోవాల్సి వచ్చింది. ఆడంబరాలకు పోయి అప్రతిష్ట పాలైన వ్యక్తిగా రిచర్డ్ ఫస్కోన్ మిగిలిపోయాడు.

ఎంత ఆదాయం వస్తున్నా ప్రణాళిక ప్రకారం ఖర్చు చేయకుండా ఆడంబరాలకు పోతే ఏం జరుగుతుందో రిచర్డ్ ఫస్కోన్ జీవిత చరిత్ర తెలుపుతుంది. అదే సమయంలో నిరాడంబరత గొప్పతనం కూడ అర్థమౌతుంది.

మన దేశానికి చెందిన ప్రఖ్యాత కింగ్ ఫిషర్ ఎయిర్ లైన్స్ అధినేత విజయ్ మాల్యా గురించి కూడ జనానికి తెలిసిందే. ఆయన కూడ తన సంపాదనలో అధిక భాగం విలాసవంతమైన జీవితాన్ని గడపడానికి దుబారా చేయడంతో అప్పుల్లో కూరుకుపోయాడు. చివరికి దేశం విడిచి బ్రిటన్ పారిపోయాడు.

ఇవన్నీ నిరాడంబరత ప్రాముఖ్యాన్ని తెలిపే విషయాలే.

ఇవన్నీ కాకుండా నిజజీవితంలో నేను చూసిన ఒక వ్యక్తి గురించి కూడ ఈ వ్యాసం చివర్లో రాస్తాను. ఆయనెవరో కాదు గ్రంథాలయ గాంధీగా పేరు పొందిన డాక్టర్ వెలగా వెంకటప్పయ్య గారు. ఆయన గ్రంథాలయ శాఖలో పెద్ద ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందారు. ప్రభుత్వ ఉద్యోగంలో రిటైర్ కావడంతో ఆయనకి పెన్షన్ రూపంలో చాలా

డబ్బు వచ్చేది. అప్పటికే ఆయన సంతానం చక్కగా స్థిరపడ్డారు. అయినప్పటికీ వెలగా వారు  నిరాడంబరంగా జీవించేవారు.

ఆయన ఒకసారి పార్వతీపురంలోని మా ఇంటికి వచ్చి ఉన్నారు. ఆ రోజు రాత్రి నా భార్య అమ్మాజి ని పిలిచి " ఈ రోజు నేను వేసుకుని విడిచిన బట్టలు ఉతికి ఇవ్వగలవా ? వాటిని తరువాత రోజుకు వేసుకుంటాను" అని అడిగారు. మేము ఆశ్చర్యపోయాము.

అప్పుడే మాకు తెలిసింది. ఆయన కేవలం రెండు జతల దుస్తులే వాడుతున్నారని. ఒక జత ధరిస్తారని, మరో జతని ఉతికి తరువాత రోజుకు దాచుకుంటారని. వారిది ఎంత గొప్ప మనసో అప్పుడే తెలిసింది.

వెలగా వారు పొదుపుగా జీవిస్తూ తన వద్ద మిగిలిన ధనాన్ని పుస్తక ప్రచురణకు, అనాథ సేవాలయాల్లోని పిల్లల ఆనందాల కోసం ఖర్చు చేసేవారు . పార్వతీపురంలో ఉన్న జట్టు సేవాశ్రమానికి కూడ ఏడాదికి ఇరవై అయిదు వేలు రూపాయలను అనాథ పిల్లల దుస్తుల కోసం పంపిన విషయం నేను ఎరుగుదును. ఆయన ముఖ్య అతిథిగా సభల్లో పాల్గొనడానికి వెళ్లినప్పుడు కూడ ఎవరి నుండి టిక్కట్ కోసం కూడ డబ్బు తీసుకునేవారు కాదు. తన డబ్బుతోనే ప్రయాణం చేసేవారు.

మళ్లీ అలాంటి లక్షణాలతో జీవిస్తున్న మరో  వ్యక్తి జట్టు వ్యవస్థాపకుడు డా. డి. పారినాయుడు. ఎంతో నిరాడంబరంగా జీవిస్తూ , తన ధనమాన కాలాలను నిరంతరం సమాజాభివృద్ధికే కేటాయిస్తున్నారు.

నిరాడంబరంగా జీవించడం వల్ల కొన్ని ప్రయోజనాలున్నాయి . అవేమిటో తెలుసుకుందాం.

అతి సాధారణంగా జీవించడం తెలిసినందు ఎలాంటి ప్రదేశంలోనైనా సర్దుకుపోగలరు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా తట్టుకుని నిలబడగలిగే శక్తి వస్తుంది.

నిరాడంబరులకు అందరి మనసుల్లో స్థానం లభిస్తుంది.  అహంభావం, అహంకారం లేకుండా ఉంటారు కాబట్టి అలాంటి వ్యక్తులంటే  అందరికీ ఇష్టమే.  వారిని అందరూ ప్రేమిస్తారు.

అలా జీవించడం వల్ల ఆత్మసంతృప్తి కలుగుతుంది. అంతులేని తృప్తి మరియు  మానసిక శాంతిని పొందుతారు.చిన్న చిన్న వాటికే సంతోషించే శక్తి సొంతమౌతుంది. అవసరమైనదానికన్నా ఎక్కువ ఆశపడకుండా ఉండడం తెలుస్తుంది. ఇతరులకు సహాయపడుతూ, తమలోని మానవత్వాన్ని పెంపొందించుకోవాలనే భావం పెరుగుతుంది.

పిల్లలూ! నిరాడంబరంగా జీవించడం అంటే ఏమిటో  తెలిసింది కదా. అలా జీవించడం వల్ల ప్రత్యేక గుర్తింపు పొందుతాం.  వ్యక్తిత్వానికి ఎలాంటి నష్టం జరగదు. సరికదా పరిస్థితుల్ని తట్టుకుని నిలబడగలగడం,

అవగాహన చేసుకునే శక్తి పెరుగుతుంది. తక్కువ వస్తువులతో ఎక్కువ సంతోషాన్ని పొందడం తెలిసిన వారు సంపదను పోగు చేయగలుగుతారు. అది మంచి భవిష్యత్తుకు సాయపడుతుంది .

అందుకే మీరు కూడ అమ్మానాన్నల్ని ఖరీదైన బొమ్మలు , ఆటవస్తువులు, దుస్తులు కొనమని అల్లరి చేయకూడదు. అలకలు, ఏడుపులతో వారిని విసిగించి భయపెట్టి కొనుక్కోకూడదు. అమ్మా నాన్నలకు మిమ్మల్ని చదివించడం సహా మరెన్నో ఇంటి ఖర్చులు ఉంటాయి . వాటిని తీర్చేందుకు వాళ్ళొక ప్రణాళిక ప్రకారం దేనికెంత అవసరమో అంతే కేటాయిస్తారు. మీరు బలవంత పెట్టి వస్తువులు , దుస్తులు కొనిపించుకుంటే వాళ్ల ప్రణాళిక తారుమారై ఇంటిని నడపడం కష్టమౌతుంది. భవిష్యత్తులో మీ పెద్దచదువుల కోసం, పెండిండ్ల కోసం చేసే పొదుపు మీద ప్రభావం చూపుతుంది. అందుకని అమ్మానాన్నలు ఏది కొనిస్తే వాటినే ఆనందంగా తీసుకోవాలి.

ఈ వ్యాసం చదివిన మీకు ఇప్పటికే అర్థమై ఉంటుంది. ఖరీదైన వస్తువుల్లో , దుస్తుల్లో ఆనందం లేదని, మనం ప్రవర్తించే తీరులో , చేరుకున్న స్థానంలో నిజమైన ఆనందం ఉంటుందని తెలిసే ఉంటుంది. కాబట్టి తెలివిగా ప్రవర్తించడం నేర్చుకోండి. ప్రక్కన కూర్చునే ధనికుల పిల్లలతో పోటీ పెట్టుకుని దుబారా ఖర్చులు చేయకండి .అవసరమైతే చదువుల్లో , ఆటల్లో వాళ్ళతో పోటీపడి మంచి ఫలితాలు సాధించండి .అది మీకూ, అమ్మా నాన్నలకు గర్వకారణం అవుతుంది.

మీరు కూడా నిరాడంబరంగా జీవించాలని అనుకుంటున్నారా? అయితే ప్రయత్నించండి. పోయేదేమీ లేదు. లాభం కలగడం తప్ప.

**————@@@———-**